ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'

ఉండి: నియోజకవర్గస్థాయిలో బుధవారం నుంచి ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ఆటల పోటీలను ప్రారంభించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఆటల పోటీల్లో ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల నుంచి క్రికెట్, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఉండిలో క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు జరగ్గా, ఉప్పులూరులో కబడ్డీ, మహదేవపట్నంలో వాలీబాల్ జట్లు పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళల కబడ్డీ విజేతగా ఉండి మండలం (ఎన్నార్పీ అగ్రహారం) జట్టు విజేతగా నిలిచింది. ఆకివీడు రెండో స్థానంలో నిలువగా, మూడో స్థానంలో నిలిచిన కాళ్ల మండల జట్టును కొన్ని అనివార్య కారణాలతో డిస్‌క్వాలిఫై చేసారు. అలాగే బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ఆకివీడు మండల విజేతగా నిలువగా ఉండి రెండో స్థానం, పాలకోడేరు మూడో స్థానంలో నిలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో పాలకోడేరు ప్రథమ స్థానం, కాళ్ల, ఆకివీడు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అదేవిధంగా మహిళల విభాగంలో కూడా పాలకోడేరు మండలం విజేతగా నిలువగా ఉండి ద్వితీయ స్థానంలోనూ, ఆకివీడు తృతీయ స్థానంలోను నిలిచాయి. వాలీబాల్‌లో కాళ్ల మండలం విజేతగా నిలువగా, పాలకోడేరు, ఆకివీడు జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. క్రికెట్ నాకౌట్ పోటీలు ముగియడంతో ఉండి, ఆకివీడు జట్లు ఫైనల్‌కు చేరినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ వై.శ్రీనివాస్, జిల్లా బీసీ సంఘాధ్యక్షుడు సూరవరపు వెంకటాచార్యులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు ఎస్.రవీంద్ర, భాస్కరరావు, ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీత, ఎంపీటీసీ సభ్యులు మున్నలూరి సువర్ణ లక్ష్మీ శ్రీనివాస్, నిమ్మల కేశవకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మహిళల కబడ్డీ విజేతగా నిలిచిన ఎన్నార్పీ అగ్రహారం జట్టుతో అధికారులు


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

క్లుప్తంగా

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం


వేగంగా జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

ఆకివీడు: స్థానిక వైఎస్సార్ సెంటర్ నుంచి సిద్ధాపురం వంతెన వరకూ సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్ సెంటర్ నుంచి సిద్ధాపురం, దుంపగడప వెళ్లేందుకు ఈ రహదారి కూడలిగా ఉంది. రోడ్డుకు చేర్చి దొరగారి మంచినీటి చెరువు గట్టు ఉండటంతో తరచూ రోడ్డు కుంగిపోతుండేది. వర్షాలకు పూర్తిగా పాడైపోయింది. ప్రధాన సెంటర్ ప్రాంతంలో రోడ్డు పాడైపోయినప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. బీటీ రోడ్డు వేసినా ఫలితం ఉండదని భావించి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు గత రెండేళ్లుగా సీసీ రోడ్డు నిర్మాణానికి నిధుల కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులు (సీఎంటి) రూ.1.20 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి నర్సింహరాజు ఇటీవల భూమి పూజ చేశారు. సంక్రాంతి పండుగ అనంతరం రోడ్డు పనుల్ని ప్రారంభించారు. వైఎస్సార్ సెంటర్ నుంచి స్టేషన్ రోడ్డు వరకూ 10 నుంచి 15 మీటర్లు వెడల్పుతోనూ, అక్కడ నుండి సిద్ధాపురం గేటు వరకూ, రైల్వే ఫీడర్ రోడ్డు వరకూ సీసీ రోడ్డు 7 మీటర్ల వెడల్పులో నిర్మాణం జరుగుతుందని ఆర్అండ్‌బీ జేఈ శ్రీహరి చెప్పారు.

నిరుపయోగ చెక్కుల దహనం


చెక్కు బుక్‌లను దహనం చేస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని ఖజానా కార్యాలయాలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న చెక్కు బుక్‌లను దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి అదారి గణేష్ చెప్పారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో రెవెన్యూ, పోలీసు, ఫైర్, ఖజానా అధికారుల సమక్షంలో ఖజానా కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న చెక్కు బుక్‌లను కాల్చివేశామన్నారు. ఈ సందర్భంగా డీటీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చాల కాలంగా నిరుపయోగంగా ఉన్న వివిధ రకాల చెక్కు బుక్కులు దహనము చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు జేసీ ఆధ్వర్యంలో పది మంది జిల్లా అధికారులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కమిటీ సూచనల మేరకు బుధవారం జిల్లాలో ఏడు ఉప ఖజానా కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న 2,044 చెక్కు బుక్కులలోని 60,800 చెక్కులతో సహా దహనం చేశామని గణేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకదళ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు, ఏటీవోలు అబ్దుల్ హకీమ్, బి.లీల, ఎస్టీఓ ఎ.రవి వర్మ పాల్గొన్నారు

సైకిల్ షెడ్ ప్రారంభం

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు గ్రామంలో ఉన్న పింగళి వెంకయ్య ఓరియంటల్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు, పరకాల ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సైకిల్ షెడ్ నిర్మించారు. ఈ షెడ్‌ను బుధవారం ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్య మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాజ తూర్పు సర్పంచ్ పొలంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పనికి ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా దాతల సహకారం తీసుకుని అభివృద్ధి పనులు చేయడం ఆహ్వానించదగిన పరిణామం అన్నారు. కార్యక్రమంలో పరకాల ట్రస్ట్ ట్రస్టీ పరకాల రాజేశ్వరరావు, ఎంపీటీసీ జిల్లెళ్ల రత్నంరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొప్పినీడి సర్వేశ్వరరావు, హైస్కూల్ హెచ్ఎం మహ్మద్ లియాఖత్ ఆలీ పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల నిలిపివేత

పెనుగొండ: నడిపూడిలో బుధవారం ఇసుక అమ్మకాలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తుండగా అధికారులు నిలిపివేశారు. చెన్నైకు చెందిన కంపెనీకి ఇసుక తవ్వకాల టెండర్ దక్కిందంటూ వారి ప్రతినిధులు ఇసుక బాట వేసి బుధవారం అమ్మకాలకు యత్నించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు స్పందించి నడిపూడిలో ఇసుక తవ్వకాలను నిలిపివేసి యంత్రాలను గట్టుపైకి చేర్చారు. తవ్వకాలకు అనుమతులు చూపి తవ్వకాలు ప్రారంభించుకోవాలని సూచించారు. ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ పరిశీలించి అనుమతి పత్రాలు చూపాలని మైన్స్ అధికారులకు సూచించారు. గత నెలలోనూ ఇదేవిధంగా టెండరుకు సంబంధించిన కంపెనీ ప్రయత్నించింది. మరోసారి కూడా ఇలానే ప్రయత్నించడంతో అధికారులు తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు. అనుమతి పత్రాలు వచ్చే వరకూ తవ్వకాలను అనుమతించేది లేదని తేల్చి చెప్పారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

భీమవరం అర్బన్: వాహనం బలంగా ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పాలకొల్లు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన బొర్రా ఆంజనేయులు తన కుమార్తె చెక్కపల్లి ప్రభావతి ఇంటికి యనమదుర్రు సంక్రాంతికి వచ్చాడు. బుధవారం గ్రామంలో ఆంజనేయులు రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై అతనికి కాలు విరిగింది. ఆయన కుమార్తె ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువజనోత్సవాల్లో విష్ణు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయ యువజనోత్సవాల్లో స్థానిక విష్ణు కళాశాల విద్యార్థులు ముగ్గురు పాల్గొన్నట్టు ప్రిన్సిపాల్ మంగం వేణు తెలిపారు. వీరిని బుధవారం కళాశాలలో వేణుతోపాటు ఎన్ఎస్ఎస్ సమన్వకర్త గంగరాజు, డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు. ఈనెల 12 నుంచి అయిదు రోజులు పాటు మహారాష్ట్రలోని నాసిక్‌లో యువజనోత్సవాలు నిర్వహించినట్టు వేణు చెప్పారు.

బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ


భీమవరం : బేటి బచావో బేటి పడావో పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: బాలికల విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు పౌష్టికాహారం, సమతుల్య ఆహారం తీసుకోవడంలో తల్లిదండ్రులు పాత్ర ముఖ్యమని మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతరాణి అన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్థానిక సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ బాలికల రక్తహీనత లేకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలల రక్షణాధికారి ఆర్ రాజేష్ మాట్లాడుతూ బాలికల వ్యక్తిగత భద్రతను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులకు తెలపాలని అత్యావసర సేవావిభాగమైన టోల్ ఫ్రీ నంబర్ 1098ను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బేటీ బచావో బేటీ పఢావో పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్, సీడీపీఓ లక్ష్మీకాంతం, నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, సోషల్ వర్కర్ మమతశ్రీ, కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల దేశానికే గర్వకారణం

భీమవరం అర్బన్: ఆడపిల్ల దేశానికే గర్వకారణమని ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు అన్నారు. భీమవరం మండలం చినఅమిరం హైస్కూల్లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ బాలుర కంటే బాలికలు అన్ని రంగాలలో ముందంజలో ఉంటున్నారన్నారు. ప్రధానోపాధ్యాయులు వేగేశ్న అనురాధ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రమాణ స్వీకారం చేసిన రోజున జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ఆడపిల్లలను పుట్టనిద్దాం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిమ్మ రాము, పీకేడీ రాజ్యలక్ష్మి, పి.సునీత, బీటీ సుందరి, పి.అన్నపూర్ణ, జె.శకుంతల, ఎం సుభద్ర సూర్య కుమారి, ఎస్ రమా జ్యోతి, ఎ.పద్మ, కె.ఉమాదేవి, తులసి, రాధిక, పి.రవిరాజు, టి.అప్పన్న, జి.శ్రీనివాస్, జి.నాగేశ్వరరావు, వై.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

కాళ్ల: జాతీయ బాలికల దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కాళ్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలించి, బాలికలను అన్ని రంగాలలో ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆత్మవిశ్వాసంతో బాలికలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఆర్ఐ కిరణ్మయి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు హేమలత, సూర్యకుమారి, పీహెచ్‌సీ డాక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం


రెడ్డిచెరువులో షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన తాటాకిల్లు

భీమవరం అర్బన్: మండలంలోని నాగిడిపాలెం పంచాయతీ రెడ్డి చెరువులో వనమాలి లక్ష్మి (70) తాటాకిల్లు బుధవారం వేకువ జామున షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంటి పైభాగంలో మంటలు చెలరేగడంతో లక్ష్మి మెళుకువ వచ్చి వెంటనే బయటకు వచ్చేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు బకెట్లతో మంటలను అదుపు చేశారు. మంచం, ఇతర గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లాటి భవానీ శంకర్, సర్పంచ్ నాగిడి నారాయణస్వామి, పెద్దలు ఘటనా స్థలాన్ని పరిశీలించి వృద్ధురాలు లక్ష్మిని ఓదార్చారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే లక్ష్యం


32వ వార్డులో మాట్లాడుతున్న తోట భోగయ్య

భీమవరం(ప్రకాశం చౌక్): ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ, అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక 32వ వార్డులో జగన్ మళ్లీ ఎందుకు కావాలి అనే కార్యక్రమం వార్డు ఇన్‌చార్జి మాజీ కౌన్సిలర్ మెట్ట మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. పథకాల డిస్‌ప్లేని ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ గాదిరాజు తాతరాజు అధ్యక్షత సభ నిర్వహించారు. కోడే యుగంధర్, ఎ.ఎస్‌రాజు, గంటా సుందర్‌కుమార్, పాలవెల్లి మంగ, రేవూరి గోగురాజు, ముల్లి నర్సింహమూర్తి, చెల్లబోయిన సూర్యప్రకాష్, బడుగు అశోక్, మానేపల్లి నాగన్న, కొల్లి ప్రసాద్, మునగాల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్లో 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం పెన్నాడలో కలుసుకున్నారు. 46 సంవత్సరాల అనంతరం కలుసుకున్న వీరంతా క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈ సారి కుటుంబ సభ్యులతో సహా కలుసుకోవాలని, సావనీర్ విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో సానా వెంకటేశ్వరరావు, కె.రాము, శ్రీపాద రవి, సన్నిధి రామలింగేశ్వర రావు, తులా సత్యనారాయణ, పార్వతి, కేవీఎస్ పద్మావతి, సాగి కృష్ణవేణి, పైలా రామకృష్ణ, కొంతేటి లక్ష్మణ్, ధనంజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పెనుమంట్ర: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ పదవ తరగతి విద్యార్థులకు సరఫరా చేస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి విద్యార్థులకు సూచించారు. బుధవారం మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలలో స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ నెగ్గిపూడి, మార్టేరు, ఆలమూరు,మాముడూరు, జుత్తిగ, పెనుమంట్ర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 252 మంది ఇంగ్లీష్, 169 మంది తెలుగు మీడియం విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మార్టేరులో వికసిత్ భారత్

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు , సత్యవరం సచివాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు మట్టాకు మారి, సీహెచ్ సునిత అధ్యక్షతన బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమాలు నిర్వహించిన మార్టేరు జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు తక్కువ సమయంలో అందజేస్తున్న ఘనత ఆంధ్ర ప్రదేశ్‌దేనని గుర్తు చేశారు.

పెదతాత విగ్రహాన్ని వివాదం చేయవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహరాజు

భీమవరం: డీఎన్నార్ కళాశాల స్థల దాత గన్నాబత్తుల పెదతాతను కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ గౌరవిస్తుందని కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు అన్నారు. మంగళవారం భీమవరంలో ఆయన కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, ఉపాధ్యక్షుడు చిలుకూరి బోస్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కళాశాల అతిథిగృహం వద్ద గతంలో ఉన్న చిన్నవిగ్రహాన్ని తొలగించి మరో విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, అయితే తొలగించిన విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కింద పడవేసి అవమానపర్చడం తమను ఎంతగానో బాధించిందని చెప్పారు. ఈ సందర్భంగా గన్నాబత్తుల పెదతాత కుటుంబానికి క్షమాపణ చెబుతున్నామన్నారు. కళాశాల ఆవరణలో పెదతాత భారీ విగ్రహం ఏర్పాటుకు గవర్నింగ్ బాడీ సమావేశంలో తీర్మానించి, అనుమతి ఇస్తామని చెప్పారు. పొరపాటున జరిగిన సంఘటనను వివాదం చేయవద్దని వెంకటనర్సింహరాజు కోరారు.

సీఎం జగన్‌తో ప్రజలకు భరోసా


మాదివాడలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: ప్రజల అవసరాలను తీరుస్తూ, ప్రజల ఆరోగ్యం మెరుగు పడే విధంగా, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం నిరంతరం కృషిచేస్తూ పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు భరోసాగా ఉన్నారని త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అంబటిరమేష్ చెప్పారు. స్థానిక మాదివాడ సచివాలయం-3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పథకాలు అమలుజేస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు యోగ క్షేమాల్ని తెలుసుకుంటున్నారన్నారు. త్వరలోనే విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించి గ్రామాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామని వివరించారు. శిబిరంలో బీపీ, సుగర్, గుండె పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 520 మందికి వివిధ రకాల పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ నిమ్మల నాగు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు, నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఏపీటీలో విద్యార్థుల ప్రతిభ


ఎన్ఏపీటీ ర్యాంకర్లను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: నేషనల్ ఎనైటికల్ ఏప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్ఏఏటీ)లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ర్యాంకులు సాధించారని స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. బుధవారం స్థానిక స్కూల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ వివరాలను కృష్ణంరాజు విలేకర్లకు వెల్లడించారు. గత నెల 30న దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్ఏఏటీలో తమ విద్యార్థులు పీపీ సత్యలక్ష్మి, ఎం రేవంత్ కుమార్, కె.ఆర్తీక 8వ ర్యాంకు, పి.నిఖిలేష్, వి.రామ సత్య సాయి, ఎ.చరణ్, పీఎం శ్రీకీర్తి 9వ ర్యాంకు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, యు.యుగసుధ, కేవీ సత్యనారాయణ, ఉమ, బాబా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు


రాయకుదురులో మాట్లాడుతున్న డీఈఓ ఆర్‌వీ రమణ

వీరవాసరం: 10వ తరగతి విద్యార్థులంతా అత్యధిక ఉత్తీర్ణతా శాతాన్ని సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వీ రమణ తెలిపారు. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు, 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు.

● వీరవాసరం మండలం తోలేరు శివారు పడమటిపాలెం, నడపనవారిపాలెం గ్రామాల్లో పాఠశాల భవన నిర్మాణాలను డీఈఓ ఆర్ వెంకటరమణ బుధవారం పరిశీలించారు. పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారని, ఈ పరిశీలనలో నడపనవారిపాలెం , పడమటిపాలెం పాఠశాలల నిర్మాణం అసంపూర్ణంగా నిలిచిపోవడంతో వాటిని పరిశీలించామని డీఈఓ తెలిపారు.

ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు కానుకల శ్రీనివాసరావు, కాయల వీరాస్వామి, కేవీడీ ప్రసాద్, అంగర వేణు, మెంటే అరుణ, గట్కారి, సుబ్బరాజు, సీహెచ్ కుమారి, ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, సర్పంచ్ వేండ్ర లీలా కృష్ణ, పీఓ శ్యాంసుందర్, ఎంఈఓలు రాజేష్, శ్రీమన్నారాయణ, పంచాయితీ రాజ్ డీఈ స్వామి నాయుడు, ఉపాధ్యాయులు శనివారపు శ్రీరామచంద్రమూర్తి, ఎం దుర్గారావు నక్కా సతీష్‌బాబు, సీఆర్పీలు అందే చంద్రశేఖర్, కడలి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో ప్రజలకెంతో మేలు


ఉణుదుర్రులో కులగణన చేస్తున్న అధికారులు

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సాహసోపేతంగా చేపట్టిన కులగణనతో ప్రజలకు చాలా మంచి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ మండలాధ్యక్షుడు జి.సుందర్‌కుమార్ అన్నారు. బుధవారం ఉణుదుర్రులో నిర్వహిస్తున్న కులగణనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత మంచి చేయాలనే ఉద్దేశంతో ఆయా సామాజికవర్గాల లెక్కలు తేలుస్తున్నారని అన్నారు. దీని వల్ల ప్రజలకు మరింత సంక్షేమం అందించేందుకు వీలుంటుందని అన్నారు. అలాగే ఎక్కడా ఇబ్బందులు లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మరింత వీలుంటుందన్నారు. కులగణన వివరాల చెప్పేందుకు ఎవ్వరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. స్వచ్ఛందంగా అధికారులకు వివరాలు వెల్లడించవచ్చునన్నారు. వివరాలు చెప్పేందుకు ఇష్టం లేనివారు నోకేస్ట్ అనే ఆప్షన్‌ను కూడా ఎంచుకునే వీలుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం


ఆర్టీసీ డ్రైవర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్టీసి వ్యవస్థలో డ్రైవర్ పాత్ర చాలా కీలకమని స్థానిక డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి అన్నారు. భీమవరం ఆర్టీసి బస్టాండ్‌లో డ్రైవర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా డ్రైవర్లు విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఐ వై.సురేష్ మాట్లాడుతూ డ్రైవర్లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తారని తెలిపారు. చెరుకువాడ రంగసాయి డ్రైవర్లు విశిష్టతను వివరించారు. అనంతరం ఆర్టీసి ఉత్తమ డ్రైవర్లు ఆర్వీ రాజు, టీవీ రాజు, కేవీ రావు, కేజీ రాజు, ఎంకే రావు, టీపీ రాజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎన్నార్, ఆదిత్య కళాశాల విద్యార్థులు, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

కోడింగ్‌లో ప్రావీణ్యత సాధిస్తే ఉద్యోగావకాశాలు


కోడింగ్ కాంపిటేషన్‌ను పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు కోడింగ్‌లో మంచి ప్రావీణ్యత సంపాదిస్తేనే సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అన్నారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ పర్యవేక్షణలో కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఐసీవోఎం సీవోడీఈఆర్‌జెడ్-2కె23 పేరిట నిర్వహించే కోడింగ్ కాంపిటేషన్ పోస్టర్‌ను నిశాంత వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ విద్యార్థులు కోడింగ్ క్లబ్ ద్వారా నూతన టెక్నాలజీని అధ్యయనం చేయాలన్నారు. సి ప్రోగ్రామింగ్‌లో మొదటి స్థానంలో నిలిచిన మొదటి సంవత్సరం ఏఐఎంఎల్ విద్యార్థి ఎ.విజయ బాబుకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కోడింగ్ క్లబ్ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డేవిడ్ రాజు మాట్లాడుతూ కోడింగ్ క్లబ్ వంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.